శ్రీలక్ష్మి కొడుకు దగ్గరకొచ్చి నెలరోజులైంది. కోడలికి ఆరోగ్యం బాగాలేదంటే ఓ పది రోజులుండి సాయం చేద్దామని వచ్చింది. నిత్యం భర్తని తలచుకోని క్షణమంటూ లేదు. ఆయనక్కడ వంటరిగా ఎలా ఉన్నారో ఏమో! అసలే బి.పి. మనిషి. వేళకు మందులు వేసుకొంటున్నారో లేదో. వెళతానంటే అప్పుడేనా అంటారు. వచ్చినప్పటినుంచి ఒక్క క్షణం విశ్రాంతి లేదు. ఇంటిపనీ వంటపనీ అన్నీ తనే చేస్తున్నది.

''అమ్మా! ఈరోజు ఆదివారం వంట ఏంచేస్తున్నావంటూ'' కొడుకు రాజేష్ అడిగాడు.

''నీకిష్టమైనవి చెయ్యమంటే చేస్తాను. చెప్పు. ఏం చేయమంటా''వంది.

''ఈరోజు మా ఫ్రెండ్స్ ఇద్దరు భోజనానికి వస్తున్నారు. ఏదైనా స్పెషల్‌గా ఉండేటట్లు చేస్తే బాగుంటుంద''న్నాడు.

''అలాగే'' అంది.

కోడలికి ఆరోగ్యం కుదుటబడినా కాస్త సాయం చేయటానికి వంటింట్లోకి అడుగుపెట్టదు. టి.వి ముందు కూర్చుని కదలదు. తనకి మాత్రం ఓపిక ఉంటుందా యాభై ఏళ్ళు దాటినాక బద్ధకించకుండా చీకటితో లేచి అన్ని పనులు చేస్తుంది. అందుకే ఆరోగ్యంగా ఉందంటారు.

వ్యాయామం చేయాల్సిన పనిలేదు. తన వయసు వాళ్ళంతా చీకటితో లేచి వాకింగ్‌కి వెళతారు. రాత్రి పూట భోజనం మానేసి పచ్చికూరగాయల ముక్కలు గోధుమ రొట్టెలు తింటారు. తన అదృష్టం. బి.పిలు, షుగర్‌లు లేవు.

వంటిగంట కాగానే రాజేష్ ఫ్రెండ్స్‌ని తీసుకొచ్చాడు. టేబుల్‌మీద అందరికీ వడ్డించింది. రాజేష్‌తోపాటు కోడలు సుగుణ కూడా భోజనానికి కూర్చుంది. ఒక్కతే నలుగురికీ వడ్డించడం కష్టం అయినా చకచకా కంచాలుపెట్టి వండినవన్నీ వడ్డించింది.

కంచంలో ఆహారపదార్థాలు చూడగానే నోట్లో నీరూరినాయి. కందిపచ్చడి, చామదుంపల వేపుడు, మజ్జిగ పులుసు, వాటితోపాటు పప్పు, అప్పడాలు, వడియాలు, ఊరమిరపకాయలు. వంట చాలా అద్భుతంగా ఉందిరా అంటూ లొట్టలేసుకొంటూ తిన్నారు.

''ఎంత డబ్బిచ్చినా వంట మనుషులు ఇంత రుచిగా చేయరన్నారు''

''ఇదంతా మా అమ్మగారి చేతి వంట'' అంటూ తల్లిని పరిచయం చేశాడు.

# ఇది హోత్రా! ఆత్మహోత్రా!

''వంటవాళ్ళు డబ్బుకోసం రుచిగా వండుతారు. అమ్మ ఆకలి రుచి ఎరిగి వండుతుంది బాబూ అదే ఇద్దరికీ ఉన్న తేడా'' అంది శ్రీలక్ష్మి.

''నిజంగా నీ అదృష్టంరా రాజేష్. రోజూ కమ్మగా వండిపెట్టేందుకు నీకు అమ్మ ఉంద''ంటూ మెచ్చుకున్నారు.

మూతి ముప్ఫై వంకర్లు తిప్పుకొంటూ భోజనం చేసి చెయ్యికడుక్కొని వెళ్ళింది సుగుణ. వచ్చిన ఫ్రెండ్స్ కూడా వెళ్ళిపోయారు.

''కాస్త టేబులన్నా శుభ్రం చేయచ్చుగా. పాపం అమ్మ ఒక్కతే చేస్తున్నది. నువ్వు కూడా సాయం చేస్తే బాగుం టుంద''న్నాడు.

''నావల్ల గాదు! నేను చేయలేను. పనులు చేస్తే

## తాటికోల పద్మావతి

మళ్ళీ రోగం తిరగబెట్టవచ్చు. అసలే టైఫాయిడ్ వచ్చి తగ్గింది. ఇప్పటికే ఆఫీసుకు సెలవుపెట్టి పదిరోజులైంది. రేపు జాయినవ్వాలి''

''అమ్మకూడా వెళ్ళిపోతానంటున్నది. పాపం నాన్నని ఒంటరిగా వదిలేసి ఇక్కడెన్నాళ్ళుంటుంది''

''అక్కడ మీనాన్నకొచ్చిన ఇబ్బంది ఏమీలేదు. ఒక్కడే వండుకొని తింటాడు, లేకపోతే హోటల్ క్యారియర్ తెచ్చుకొంటాడులే. వాళ్ళేమన్నా కొత్తగా పెళ్లైన దంపతులా! ఒకరన్ని విడిచి ఒకరు ఉండలేకపోవటానికి. ఈవయసులో ఎక్కడున్నాఫరవాలేదు.ఇపుడు మీ అమ్మగార్ని పంపించివేస్తే పిల్లల్ని స్కూలుకి పంపాలి, నేను ఆఫీసుకు వెళ్ళాలి, ఇంటి పనులు ఎవరు చేస్తారు, పని వాళ్ళున్నా టైముకి రారు. అన్ని పనులు మనమే చేసుకోవాలి. ఆఫీసులో అలసిపోయి ఇంటికివచ్చి అన్ని పనులు నేనే చేసుకోవాలంటే చాలా కష్టం నావల్ల కాదండీ.

''పోనీ నాన్నని కూడా ఇక్కడికే రమ్మంటావా, అపుడు ఏ ఇబ్బందీ ఉండదు''

''మీ నాన్న వస్తే అన్నీ ఇబ్బందులే. ఆయనకేమైనా పెన్షన్ వస్తుందా... ఏమన్నానా! ఇంట్లో ఉంటే కాఫీలు, టీలు ఇవ్వాలి. బయటికెళితే ఆటోకి కూడా డబ్బులివ్వాలి. పిల్లల్ని స్కూల్‌కి దింపరమ్మంటే ముసలివాణ్ణి నేనేం చేస్తానంటారు. మీ నాన్నవల్ల ఏం ప్రయోజనం లేదు. అక్కడే చిన్నకొడుకుదగ్గరే ఉండనివ్వండి. మీ అమ్మయితే మనకి అన్ని విధాలా ఉపయోగ పడుతుంది''

సుగుణకి ఎప్పుడూ స్వార్థమే. తనకి లాభకరంగా ఉంటేనే ఉపయోగించుకొంటుంది. లేకపోతే ఇంట్లోకి ఈగను కూడా వాలనివ్వదు. తను ఉద్యోగం చేసి సంపాదిస్తుంది. భర్త తెచ్చింది కూడా తన దోసిట్లో పొయ్యాలి. పరాయివాళ్ళకెవరికీ పైసా పెట్టకూడదు. పెట్టాడని తెలిస్తే ఇక ఆరోజంతా ఇంట్లో రాద్ధాంతమే.

రమణయ్యగారు యాభైఏళ్ళు దాటేదాకా ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. పెద్ద కొడుకు రాజేష్‌కి మంచి ఉద్యోగం. భార్యకూడా ఎంప్లాయి. చిన్న కొడుకు బలరాం మాత్రం పేపర్ మిల్లులో చేస్తాడు. చిన్నకోడలుకి పసిపిల్ల ఉండటంతో బయటికెళ్ళి ఉద్యోగం చేయటానికి వీల్లేదు.

రమణయ్యగారు ఆస్మా పేషంటు. ఆయన ఆరోగ్యం దెబ్బతినటంతో ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటున్నారు. ఇప్పుడు కాస్త ఆరోగ్యం కుదుటపడింది. ఇంట్లో ఊరికే ఉంటే ఏమీ తోచడంలేదు.ఎక్కడైనా మళ్ళీ ప్రయత్నం చేయాలనుకొన్నారు. భార్యకూడా దగ్గరలేకపోవటంతో ఖాళీగా కూర్చుంటే మరీ బోర్‌గా ఉంటున్నది.

ఆ పనిమీదే బయటికివెళ్ళి వస్తుంటే దారిలో శేషావతారం కలిసాడు. ఆయన చేసే బట్టలషాపులో బిల్లులు రాయటానికి మనిషి కావాలన్నాడు. ఎంతిచ్చినా ఫర్వాలేదు. ముందు పనిలోకి చేరాలనుకొన్నాడు.

రమణయ్య ఉద్యోగంలో చేరాక కాసిని డబ్బులు చేతిలో ఆడుతున్నాయి. దాంతో ఇంట్లోకి కూరలు తేవటం పిల్లకి ఏమైనా తేవటం, అపుడపుడు పాలు, పండ్లు అంటూ డబ్బు ఖర్చు చేస్తున్నాడు. కొడుకు, కోడలికి కాస్త చేదోడు వాదోడుగా ఉండటంవల్ల ఆయనమీద గౌరవం పెరిగింది.

వేళకి అన్నీ చేసిపెడుతున్నది చిన్నకోడలు సుజాత. రమణయ గారికి ఏ ఇబ్బందీలేదు.

''రేపే అమ్మని పంపించమని అన్నయ్యకి ఫోన్ చేస్తానన్నాడు బలరాం. అక్కడే వుంటే మనకేం ఇబ్బంది లేదు. ఇక్కడ మీ నాన్నకి కావలసినవన్నీ నేను చూసుకొంటున్నాను గదా!''

''ఇంట్లో పనులన్నీ నువ్వొక్కదానివే చేసుకొంటున్నావు. వాళ్ళు మాత్రం అమ్మని ఎన్నాళ్ళు భరిస్తారు. నాన్నిక్కడ, అమ్మక్కడ ఉండటం బాగుండదు''

''ఇపుడు వాళ్ళేమన్నా వయసులో వున్న దంపతులా! ఒకర్ని వదిలి ఒకరు ఉండలేకపోవటానికి ఇద్దరి దగ్గరా చెరొకరు ఉంటారు. మీ నాన్న తెచ్చిన జీతం మనకే ఖర్చు చేస్తున్నారు. మనం నాలుగు డబ్బులు వెనకేసుకోవచ్చు.

ఇపుడు మీ అమ్మని పిలిపించారంటే ఆయన జీతం కాస్తా మీ అమ్మ చేతికే ఇస్తాడు. ఇక పనులం టారా! ఇంట్లో ఉండేదాన్నేగా, నిదానంగా చేసుకొం టాను. కాస్త పిల్ల నాలుగేళ్ళు వస్తేస్కూల్లో చేర్పించి, నేనూ ఎక్కడైనా చేరతాను. అపుడెటూ మీ అమ్మగారి అవసరం తప్పదు. తొందరపడి మీ అమ్మని పంపించమని అడగకండి. మీ నాన్నకి ఇక్కడ ఏ లోటూ లేదు. మీ అమ్మని అక్కడే ఉంచుకోమని చెప్పండి!''

కడుపున పుట్టిన పిల్లలు ఇంత స్వార్థపరులా అనిపిస్తున్నది. చిన్నపిల్లలుగా ఉన్నపుడు వేళకి తిండి ఉండేదికాదు. రాత్రుల్లు నిద్రవుండేది కాదు. అనుక్షణం వాళ్ళు ఎక్కడ పడిపోతారో ఎటువెళితే ఏం ప్రమాదం వస్తుందోనని దగ్గరుండి కాపలా కాసేవారు. ఆరోగ్యం బాగా లేకపోతే హాస్పటల్‌లో అహర్నిశలు కాపలా ఉన్న రోజులున్నాయి.

## మనిషి

సృష్టిలో అత్యంత
విచిత్రమైన జంతువు...
తన మాటకోసం
భార్యను బజార్లో తెగనమ్మగలడు..
తండ్రి ఆజ్ఞపై
కన్నతల్లినే కడతేర్చగలడు..
తన పరువుకోసం
భార్యను... నిండు చూలాలిని
క్రూరజంతువుల మధ్య వదిలేయగలడు...
వ్యసనంలో తానోడి
గెలుపుకోసం భార్యనే పందెం కాయగలడు..
పురాణ పురుషుల్ని అనుసరించడం
ఆమాటకొస్తే ఓ మెట్టుపైనే నిలవడం
'నేటిధర్మం' కదా...
'నాతి చరామి' అంటూ
తాళికట్టిన భార్యనే
వ్యభిచార కొంపలకమ్మేయగలడు...
తాగుడుకు డబ్బివ్వలేదని
తల్లినే గొడ్డలితో నరగ్గలడు...
వ్యసనానికి భార్య తాకట్టు
ఆమెతోపాటు కుతురూ ఉచితం!
తినేది 'అయ్యెఫ్ఫెం' తిండి
చేసేది గుట్టు చేరేసి దేశద్రోహం...
ఆప్తమిత్రుడని ఆతిథ్యమిస్తే
గృహస్తు భార్యపైనే అత్యాచారం...
'ప్రజాసేవ' నటిస్తూ
ప్రజలసొమ్ము కోట్లలో స్వాహా...
తాను చేస్తున్న నేరాల్ని
ఇతరులవిగా నిరూపించగలడు...
ఒకడి భార్యను తాను లేపుకొస్తే
అది పవిత్రప్రేమ
అదే మరొకడితో తిరిగితే నమ్మక ద్రోహం...
పురాణకాలంలో జరిగిన
దుర్మార్గానికో 'తెర'
పాపం, శాపం, వంశగౌరవం
ఏదైనా కావచ్చు..
నేటికాలంలోనూ
అదే తెరపై తొడుగు
రిఫైన్డ్ హిపోక్రసీ...
చిత్రాతిచిత్రాలు సృష్టిస్తూ
సృష్టిలోనే విచిత్ర జంతువు
మనిషి... మనిషి... మనిషే!!

**కొట్టి రామారావు**

ఉన్నంతలోనే ఇద్దరికీ చదువులు చెప్పించారు. వాళ్ళ అదృష్టాన్ని బట్టి వాళ్ళ జీవితాలు మారుతాయి. ఒకరు తెలివితేటలతో పైకొస్తే మరొకరు అదృష్టంతో పైకొస్తారు. పిల్లలు తప్పటడుగులు వేయకుండా కాపాడుతూ వాళ్ళ జీవితానికో గమ్యం చూపాలి.

శ్రీలక్ష్మి పండక్కి నీకు చీర తెచ్చానంటే, నాకెందుకండీ! ఆ డబ్బులుంటే పిల్లలకి మంచి బట్టలు కొనచ్చనేది. స్కూల్లో చేరిస్తే ఫీజులు కట్టటానికి ఉపయోగపడతాయనేది.

ఎప్పుడైనా సరదాగా సినిమాకి వెళదామంటే, ఇప్పుడొద్దులెండి, ఆదివారం గాంధీపార్కుకెళితే పిల్లలకి టిక్కెట్లుండవనేది. అలా ఇద్దరూ సరదాలను సంతోషాలను పాలపొంగుమీద నీళ్ళు చల్లినట్లు యాంత్రికమైన జీవితాన్ని గడిపేవారు. ప్రతి రూపాయిలో పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించడం తల్లిదండ్రుల బాధ్యతగా అనుకొనేవారు.

పిల్లలిద్దర్నీ రెండు కళ్ళుగా చూసుకొంటే, సంపాదన కోసం ఒకరు, సౌఖ్యం కోసం చెరొకరినీ పంచుకొని ఒక కన్నుతో చూస్తున్నారు.

''ఏమండీ! ఎలా ఉన్నారు. వేళకు భోజనం చేస్తున్నారా. నేనుంటే సమయానికి అన్నీ అమర్చేదాన్ని. ఎలా ఉన్నారో ఏమో! నాకు మాత్రం మిమ్మల్ని చూడాలనుందండి! నేను వెళతానంటే నన్ను పంపించటంలేదు. నాకిక్కడ ఉండాలని లేదు. మీరు వచ్చి నన్ను తీసుకెళ్ళండీ!''

''శ్రీలక్ష్మీ! నువ్వెలా వున్నావు. నువ్వు లేకపోతే నాకు తోచటంలేదు. రాత్రుళ్ళు సరిగా నిద్రపట్టడంలేదు. ఇంటి చాకిరీతో సతమతమైపోతుంటావు. నేను మాత్రం ఇక్కడ సుఖంగా ఉన్నాననుకొంటున్నావా! ఉద్యోగంలో చేరాను, నీకోసం మంచి జరీ చీరకొనాలని డబ్బులు దాచాను. ఈ వయసులో ఒంటరిగా గడపాలంటే భయంగా ఉంటున్నది. నాకు నువ్వు, నీకు నేను తప్ప మన గురించి ఆలోచించటానికి పిల్లలకెలా తోస్తుంది. నీకు నేను చాలా అన్యాయం చేస్తున్నాను.''

''తప్పకుండా వస్తారు కదండీ! పిల్లలు చిన్నపుడు బాధ్యతల కోసం మన జీవితాల్ని మనమే త్యాగం చేసుకొన్నాం. మన పిల్లలకి బాధ్యతలు తెలిసాక కూడా మనల్ని మళ్ళీ వాళ్ళ చుట్ట తిప్పుకొంటున్నారు. పాతికేళ్ళు కష్టపడి పెంచాం. మనకి బాధ్యత తీరిపోయిందనుకొంటే వాళ్ళ పిల్లల కోసం కొత్త బాద్యతల్ని అంటగడుతున్నారు. మనకి విముక్తి ఎప్పుడు. ఈ జీవితాంతం వాళ్ళకిలా సేవలు చేస్తూ ఉండాల్సిందే. మనకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవా!

తప్పకుండా మనకి మంచిరోజులొస్తాయి. నిన్ను పెళ్ళి చేసుకొన్నప్పటినుంచీ ఈ నాటి వరకూ సుఖపెట్టలేక పోయాను. నిన్నగాక మొన్న పెళ్ళి చేసుకొని వాళ్ళ భార్యల్ని ఎంతగా సుఖపెడుతున్నారో! అందుకోసం నీ స్వేచ్ఛను హరించేసి, నిన్ను చాకిరీ కోసం ఉంచుకొన్నారు. నేను రేపు బయలుదేరి వస్తున్నాను. ప్రయాణానికి సిద్ధంగా ఉండు''

''నాన్నా! ఇదేనా రావటం! భోజనం చేశారా! మళ్ళీ మీరు ఉద్యోగంలో చేరారని తెలిసింది. అమ్మ ఇక్కడా, మీరక్కడా ఉండటం దేనికి ఆ ఉద్యోగమేదో చెయ్యాలనుకొంటే ఇక్కడ చాలా ఉన్నాయి! మీరు కూడా మాతోపాటు ఇక్కడే ఉండొచ్చు''

''బలరాం కూడా అదేమాట అంటున్నాడు. అమ్మని కూడా అక్కడికే తీసుకురమ్మని, జీవితాన్ని ఇప్పటి వరకూ బాధ్యతల బరువుతోనే గడిపాం. మీకూ పెళ్ళయి, పిల్లలు పుట్టారు. మేం ఉన్నందువల్ల మీకు భారమే కాని, మా వల్ల ఏం ఉపయోగం లేదు''

''అదేంటి నాన్నా! అలా అంటారు. అమ్మ ఇంట్లో ఉంటే నీ కోడలు ఉద్యోగానికి వెళ్తున్నది, పిల్లల్ని సమయానికి స్కూలుకి పంపడం, తీసుకురావడం, నేను ఆఫీసు నుంచి రాగానే కాఫీ కలిపి ఇవ్వటం అన్నీ అమ్మే చేస్తున్నది. అమ్మని మీరు తీసుకెళ్ళిపోతే మాకు చాలా ఇబ్బంది, అందుకే మిమ్మల్ని కూడా ఇక్కడే ఉండి ఇక్కడే ఉద్యోగం చూసుకోమంటున్నాను''

''నువ్వు చెప్పింది చాలా బాగుందిరా. మీ స్వార్థ కోసం మా ఇద్దరినీ విడదీస్తారా! చిన్నపుడు మీకే కష్టం వచ్చినా రాత్రింబగళ్ళు నిద్రాహారాలు మానేసి మేమెంత నరకం అనుభవించామో మీకేం తెలుసురా! సంపాదన కోసం వేరే ఊరెళ్ళి మీ అమ్మకి దూరంగా ఉన్నాను. ఇప్పుడు నాకు సంపాదన లేదనేగా మీరిద్దరూ మా ఇద్దరినీ పంచుకొని మమ్మల్ని వేరు చేశారు.

పెళ్ళి చేసుకొన్నాక మేమిద్దరమే! ఇపుడు కూడా మేమిద్దరమే ఉండాలనుకొంటున్నాం. మిమ్మల్ని కన్నందుకు కాకపోయినా తల్లిదండ్రులనే గౌరవం మీకుంటే మా ఖర్చులకోసం ప్రతినెలా డబ్బు పంపించండి. మేం మీ దగ్గరుండాలని నిజంగానే మనస్ఫూర్తిగా కోరుకొన్నపుడు ఆనాడు తప్పకుండా వస్తాం''

''శ్రీలక్ష్మీ! బట్టలన్నీ సర్దుకొని బయలుదేర''మన్నాడు'' రమణయ్య.

ఒక చిన్న రేకుల గదిలో కలిసిఉంటున్నారు. రమణయ్య దంపతులు. చుట్టుపక్కల వాళ్ళంతా ఎంతో ఆప్యాయంగా పలుకరిస్తారు. రమణయ సంపాదనకు తోడుగా శ్రీలక్ష్మి కూడా ఆమెకి చేతనైనది పిల్లలకు చదువు చెప్పి సంపాదిస్తున్నది. ఆ బజారులో వాళ్ళంటే అందరికీ గౌరవం.

కొన్నాళ్ళు బాగానే సాగింది. కొడుకులిద్దరూ ప్రతి నెలా ఎంతోకొంత పంపిస్తుంటే ఇల్లు గడిచిపోతున్నది. వయసుపైబడే కొద్దీ రమణయ్య బైటికి వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. తల్లిదండ్రులు వాళ్ళ దగ్గర ఉండలేకోవటం కన్నా, వాళ్ళ వలన ఉపయోగం లేదనుకొన్న కొడుకులు మరింత స్వార్థంతో డబ్బు పంపటం మానేశారు. తిన్నా తినకపోయినా మందులు కొనాలంటే డబ్బు కావాలి.

''ఏమండీ! మనం మన పిల్లల దగ్గరకే వెళ్ళిపోదామండి. ఎన్నాళ్ళు పస్తులుంటాం చెప్పండి. ఎంతయినా వాళ్ళు మన బిడ్డలే గదండీ''

''కాదని నేను మాత్రం అంటానా! మనచేత చాకిరీ కోసం, సంపాదనకోసం మనిద్దరినీ వేరు చేశారు. ఇపుడు నువ్వు పనిచేసే స్థితిలో లేవు, నాకా సంపాదించే శక్తి తగ్గిపోయింది. ఇపుడు వెళితే వాళ్ళు మనల్ని చూస్తారంటావా.

మనవల్ల ఉపయోగంలేదని మనల్ని మనుషులుగా గాదు గదా, చీడపురుగులకన్నా హీనంగా చూస్తారు. వాళ్ళు తినగా మిగిలింది, పాచిపోయింది మన మొహాన పడేస్తారు. ఇంటికి కుక్కల్లా కాపలా ఉంచుతారు. రోగం వస్తే మందుకూడా ఇప్పించరు. ఎప్పుడెపుడు చస్తారా అని ఎదురుచూస్తారు.

మనం చచ్చిపోయాక కూడా దహన సంస్కారాలకి డబ్బు ఖర్చవుతుందని కర్మ కూడా చెయ్యడం మానే స్తారు. నిన్ను చేసుకొని ఏం సుఖపెట్టలేకపోయాను. చివరిరోజుల్లో మనిద్దరం కలిసి బ్రతకాలని నిర్ణయించు కొన్నాం. అలాగే కలిసి చచ్చిపోవడం నీకిష్టమేనా! చెప్పు! నీకోరికలేవీ తీర్చలేని అసమర్థుడ్ని, వాళ్ళ దగ్గర వెట్టి చాకిరీ చేయడం చూసి నేను తట్టుకోలేను''

''ఏమిటో చెప్పండి! మీ మాట ఎన్నడన్నా కాద న్నానా!''

''అందుకే! నువ్వు కాదనవనే నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకొన్నాను. ఇది నా చివరి కోరిక! ఇంకె పుడూ ఏమీ కోరను!''

''చెప్పండి! ఏం చేయాలో...'' కళ్ళలో నీళ్ళు ధారా పాతంగా కారిపోతున్నాయి.

''ఓసి పిచ్చిదానా! ఏడుస్తున్నావా? మనకి మంచి రోజులు రాబోతున్నాయి. ఇంకెప్పటికీ ఏడ్వకూడదు. మనకే కష్టాలూ మన దగ్గరికి రావు. తిండికి గుడ్డకీ ఏ లోటుండదు. నువ్వు, నేనూ కష్టపడాల్సిన పనే లేదు''

''ఏమిటండీ! మీరు చెప్పేది వింటుంటే నాకు నమ్మ బుద్ధి కావడంలేదు. ఏమిటా అదృష్టం తొందరగా చెప్పండి!''

## అన్వేషణ

ఉగ్రవాదుల బాంబు దాడుల్లో
ఛిన్నాభిన్నమవుతున్న దేశం గురించి కాదు
స్వార్ధరాజకీయాల కత్తులకీ
తలలేని మొండెంలా మిగిలే
పేదల జీవితాల గురించి కాదు
కాసుల రాక్షసికీ అమ్ముడవుతున్న తీర్పులకైన
అంధకారం వీడని న్యాయదేవత గురించి కాదు
సగటు మనిషి శ్రమదోపిడితో
శవాలపై చిల్లర వ్యాపారం చేసే
కుతంత్రుల గురించి కాదు
చినుకు చినుకులా కురిసే వరుణదేవుడు
సునామీలా పోటెత్తి
చిత్రవ్యధ చేసిన బతుకుల గురించి కాదు
ఎర్రటి నిప్పుల కిరణాలతో మండే సూర్యుడు
ప్రకృతిశోభని కాల్చేస్తూ
వన్యజీవుల ప్రాణాల్ని హరిస్తూ
మనుషుల మనుగడని భస్మం చేస్తూ
బిడ్డల్లేని గొడ్రాలుగా చేస్తున్న
భూమాత గురించి కాదు
ఆకలితో పేగులనుండి పుట్టి
ఆర్తనాదాల గురించి కాదు
తడారిపోతున్న గొంతులో నుండి
తనువు చాలిస్తూ చేస్తున్న
చివరి ప్రకంపనల గురించి కాదు
కలలన్ని శిలలై కళ్ళు దుఃఖిస్తుంటే
కన్నీళ్ళకీ బదులుగా
కారుతున్న రక్తం గురించి కాదు
మనిషిని మనిషి ప్రేమిస్తూ
మహనీయులై మరణించే
మనుష్యుల కోసమే నా ఈ అన్వేషణ

శాగంటి శ్రీకృష్ణ

''ఒక్కసారిగా మనల్ని వరించివస్తున్న అదృష్టాన్ని విని తట్టుకోలేవు. నీతో పంచుకొన్న జీవితంముందు ఈ అదృష్టం ఏపాటిది. నా మనసుకు నువ్వు చూపించిన పూలవనాలు, సెలయేర్లు, అద్భుత సౌందర్యాల సుకుమార సుమాల పరిమళాలు చల్లి, శిశిరంలాంటి నాకు వసంతమై నా హృదయ నందనవనంలో పూలు పూయించావు. నీకు నేనెంతో ఋణపడి వున్నాను.

ఈనాటితో మన బంధాలు ఋణాలన్నీ తీరిపోతాయి. నీకిష్టమని చెరుకురసం తెచ్చాను. నాకు చాలా అలసటగా ఉంది. కాసేపు విశ్రాంతి తీసుకొంటాను'' అంటూ సగం చెరుకురసం భార్యకి గ్లాసులో పోసిచ్చి మిగిలింది తాను తాగి గదిలోకెళ్ళి మంచంమీద పడుకొన్నాడు విశ్రాంతికోసం. నేనులేని మర్నాడు శ్రీలక్ష్మి కూడా గుండె ఆగి మరణిస్తుంది. అదే ఆమెకి చివరి అదృష్టం.

అయినవాళ్ళచేత కాదనిపించుకొని కష్టాలకొలిమిలో కాలిపోతూ బ్రతకడంకన్నా చావటం అదృష్టం. నేను లేని మర్నాడు దిగులుతో మంచంఎక్కి తొందరలోనే నన్ను చేరుకొంటారంటూ మృత్యువును ఆహ్వానించటానికి తను దాచుకొన్న నిద్రమాత్రలు ఆ చెరుకు రసంలో కలుపుకొని తాగేసింది. ఇంక ఈ జన్మకి చివరి విశ్రాంతి కోసం శ్రీలక్ష్మి కూడా మంచంమీద కళ్ళు మూసుకొంది.

నిన్న ఉదయం కనిపించి మాట్లాడారు. సాయంత్రం కూడా భార్యాభర్తల్ని చూశాం. తెల్లవారి పదిగంటలైనా ఎవరూ బయటికి రాలేదు. ఏమైందంటూ చుట్టుపక్కల జనాలంతా కిటికీలోంచి తొంగి చూసి ఆశ్చర్యపోయారు.

అందరూ కలిసి తలుపులు బద్దలు కొట్టారు. భార్యాభర్తలిద్దరూ శాశ్వతంగా నిద్రపోతున్నారు.

ఎలా జరిగింది. ఎందుకు జరిగింది. ఎవరైనా చేశారా? వాళ్ళే చేసుకొన్నారా?? పోలీసులొచ్చారు, కేసు రాసుకొన్నారు. ఇంట్లో ఎక్కడో ఫోన్ నెంబర్లు దొరికాయి. ఫోన్‌లు అందగానే కొడుకులిద్దరూ పరుగెత్తుకొచ్చారు.

ఇది హత్యా! ఆత్మహత్యా! పోలీసు ఎంక్వైరీ చేస్తున్నారు. వాళ్ళ తాలూకు మేమేనంటూ వచ్చారు రాజేష్, బలరాం.

''వీళ్ళేనండీ వాళ్ళని హత్య చేసింది. కేసు వ్రాసుకోమన్నారు'' పక్కనున్న పెద్ద మనుషులు.

''మాకేంపని మేమెందుకు చంపాం! మాకేం తెలీదన్నారు''

''ఈ హత్యలు మీరే చేశారు. గొంతు నులమకుండా కత్తితో పొడవకుండా ఉరితాళ్ళు బిగించకుండా హత్య చేశారు. తల్లిదండ్రులనే కనికరం లేకుండా తిండి పెట్టకుండా ఆకలికి మాడ్చి చంపారు.

ఇంట్లో ఉన్నన్నాళ్ళు మీ పెళ్ళాంకి సేవలు చేయించుకొని పట్టెడన్నం పెట్టారు కాని, వయసుడిగి చాకిరీ చేయలేక బయటి కొస్తే ఉంటానికి నెలనెలా డబ్బు పంపకుండా మీ సరదాలు, సౌఖ్యాలు చూసుకొని, తల్లిదండ్రుల్ని గాలికొది లేసి మానసికంగా, విచక్షణారహితంగా వాళ్ళ చావు వాళ్ళే చచ్చేటట్లు చేశారు.

వాళ్ళ ఆత్మల్ని వాళ్ళు చంపుకొన్నా అలా చేసుకోవటానికి ప్రేరేపించింది మీరే. ఇది కొడుకులు చేసిన హత్యే! ఇలాంటి కొడుకుల్ని అరెస్టు చేసినా పాపం రాదు. వాళ్ళకీ కొడుకులుండాలి, వీళ్ళకీ ఇదే గతిపట్టాలి. అపుడే అసలైన శిక్ష''

నలుగురూ అసహ్యించుకొన్నారు! అంతా అయిపోయాక విచారించి ఏం ప్రయోజనం కనీసం తలకొరివిపెట్టి ఋణం తీర్చుకోవాలనుకొన్నారు. ఇలాంటి చావు ఏ తల్లిదండ్రులకూ రాకూడదు. నేటి కొడుకూ రేపటికి తండ్రే! తండ్రికి చేసిన మర్యాద రేపు తన కొడుకు తనకి చేస్తాడని మరచిపోగూడదు. ■

## ప్రత్తి చేలు

బట్టలుగా మారి
మానవుల మానాలు
కప్పాలన్న ఆశయంతో
ప్రత్తి చేలు పూస్తున్నాయి
చేనేత వస్త్రాలకు ఆదరణ కరువై
చేనేత కార్మికుల జీవన భృతి కనుమరుగై
మృతిచెందిన వారి
తలదగ్గర వత్తులై జ్యోతిగా
వెలుగుతూ తనువులు త్యాగం
చేసుకుంటున్నాయి
ప్రత్తి చేలు

సింగిడి రామారావు